
సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



కొబ్బరి చెక్కల ఆదాయం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కొబ్బరి చెక్కల వేలంలో రూ.1.35 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆగంటి ప్రభాకరరావు సోమవారం తెలిపారు.



కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4,900,మధ్య డెల్టాకు 2,600,పశ్చిమ డెల్టాకు 7,500క్యూసెక్కుల నీటిని వదిలారు.

యశస్వీభవ



ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం యశస్వి) పథకం అమలు చేస్తోంది.

IIలో..

న్యూస్‌రీల్

డీఆర్‌ఎంతో ఎంపీ భేటీ



భరత్‌రామ్‌కు జాతీయజెండాను అందజేసిన నరేంద్ర.చిత్రంలో రౌతుసూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్‌తో ఎంపీ మార్గాని భరత్‌రామ్ సోమవారం భేటీ అయ్యారు. నిడదవోలు, అనపర్తి నియోజకవర్గం కేశవరం ఎల్సీల వద్ద ఆర్వోబీల నిర్మాణం, అనపర్తి, నిడదవోలు స్టేషన్లలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, గోదావరి స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైల్వే బోర్డు ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిందన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఖాళీ రైల్వే ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పున అభివృద్ధి చేయాలని కోరామన్నారు. డీసీఎం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఉన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ మాధవీలత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.55 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరై జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారని తెలిపారు. అనంతరం పోలీసు గౌరవ వందన స్వీకరణ, ముఖ్య అతిథి సందేశం ఉంటుందన్నారు. పోలీసు కవాతు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమాచారంతో వివిధ శాఖల శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల పంపిణీ జరుగుతాయని వివరించారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించండి

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను నిర్దేశిత కాల వ్యవధిలోగా పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి 180 అర్జీలు అందించారన్నారు. వాటిని ఆయా శాఖలకు పంపి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చామన్నారు.


పోలీసు స్పందనకు 22 ఫిర్యాదులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 22 అర్జీలు వచ్చాయి. ఇన్‌చార్జ్ ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ స్పందన నిర్వహించారు. జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఆమె స్వీకరించారు. జోనల్ డీఎస్పీల సమక్షంలో స్వీకరించి ఫిర్యాదుదారులతో స్వయంగా ముఖాముఖిగా మాట్లాడారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, చోరీ కేసులు, చీటింగ్ కేసులపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి చట్ట ప్రకారం విచారణ జరిపించాలన్నారు. జాప్యం లేకుండా తక్షణమే పరిష్కారం చేస్తామని ఏఎస్పీ వారికి హామీ ఇచ్చారు.

13 వార్డులు ఏకగ్రీవం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో 19 గ్రామ పంచాయతీలలో ఖాళీ ఏర్పడిన 22 వార్డుల సభ్యుల ఎన్నికకు సంబంధించి సోమవారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయింది. దీంతో 13 వార్డులకు ఎన్నిక ఏకగ్రీవమైందని జిల్లా పంచాయతీ అధికారి జే.సత్యనారాయణ తెలిపారు. కోరుకొండ మండలం బుచ్చింపేట గ్రామపంచాయతీలోని 7వ వార్డుకు ఎన్నికకు సంబంధించిన నామినేషన్‌ను తిరస్కరించారు. 8 వార్డులకు ఈనెల 19న ఎన్నికలు జరగనున్నాయి. అదేరోజు మధ్యాహ్నం లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామన్నారు. 8 వార్డులకు గాను 18మంది బరిలో నిలిచారు. నిడదవోలు మండలంలో మూడు, పెరవలి మండలంలో ఒకటి, సీతానగరం మండలంలో మూడు, కడియం మండలంలో ఒకటి ఏకగ్రీవంకాగా,అనపర్తి మండలంలో మూడు వార్డు మెంబర్లకు గాను ఒకటి ఏకగ్రీవమైంది. రెండింటికి ఎన్నికలు జరగనున్నాయి. రాజానగరం మండలంలో మూడు ఏకగ్రీవమయ్యాయి. రెండింటికి ఎన్నికలు జరుగుతున్నాయి. ఉండ్రాజవరం మండలంలో ఒకటి ఏకగ్రీవంగా కాగా, ఒకవార్డుకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం



"గ్రామాలు బాగుంటేనే... దేశం బాగుటుంది"
– మహాత్మాగాంధీ

- మహాత్ముడి మాటకు సరికొత్త బాట
- పల్లె చెంతకే ప్రభుత్వ సేవలు
- సచివాలయలతో వినూత్న పథం
- గాంధీజీ కన్న కలలు సాకారం
- నేడు స్వాతంత్య్ర దినోత్సవం

'గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.. పల్లెలు అభివృద్ధి సాధిస్తే నగరం, దేశం, రాష్ట్రం అభ్యున్నతి సాధిస్తుంది. గ్రామ స్వరాజ్యంమే నా ఆశయం.' అని జాతిపిత మహాత్మాగాంధీ అభిప్రాయ పడ్డారు. ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆచరణ దిశగా అడుగులు వేసింది. సచివాలయ వ్యవస్థతో పల్లె ముంగిటకే సంక్షేమ పథకాలు, పాలన, అన్ని రకాల పౌర సేవలు తీసుకువచ్చి గాంధీ కలలుగన్న స్వరాజ్యాన్ని స్థాపించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ కోరుకున్న విధంగా 'నాడు–నేడు', వసతి, విద్యా దీవెన పథకాలతో అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్య అందుతోంది. మహనీయులు ఆశించిన మేరకు పాలన సాగుతోంది. ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే తీసుకెళ్లేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ గ్రామీణ వైద్య శాలలు, డిజిటల్ లైబ్రరీ, పాల సేకరణ కేంద్రాలకు నాంది పలికింది. నేడు స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తీసుకువచ్చిన సంస్కరణలు, పథకాలపై ప్రత్యేక కథనం.



కడియం మండలంలో రూపుదిద్దుకున్న గ్రామ సచివాలయం



శాటిలైట్ సిటీలో నాడు-నేడులో కార్పొరేట్ తరహాలో అధునీకరించిన పాఠశాల



రైతు భరోసా కేంద్రం

సాక్షి, రాజమహేంద్రవరం: మహాత్ముడు కన్న కలలకు ప్రతిరూపాలుగా సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకువచ్చింది. సచివాలయాల ద్వారా 536 సేవలు అందజేస్తోంది. బర్త్, ఇన్‌కమ్, క్యాస్ట్ తదితర ధ్రువీకరణ పత్రాలన్నీ ఉన్న ఊరులోనే అందజేస్తోంది. సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రూ.150.20 కోట్ల వ్యయంతో 390 మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 152 భవనాలు పనులు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

బల్క్‌మిల్క్ కేంద్రాలు

పాడి రైతులకు ప్రోత్సాహం అందించే క్రమంలో గ్రామాల్లో ప్రభుత్వం బల్క్ మిల్క్ కేంద్రాలు (పాల శీతలీకరణ కేంద్రం) అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ నిర్ణయంతో పాడి రైతులకు లబ్ధి చేకూరుతోంది. నేరుగా రైతే కేంద్రంలో పాలు విక్రయించడంతో మంచి ధర లభిస్తోంది. ప్రభుత్వ ప్రయోజనాలన్నీ పొందే వీలు కలుగుతోంది. జిల్లాలో 75 భవనాలు మంజూరవగా.. రూ.10.60 కోట్ల నిధులు వెచ్చించనున్నారు. 71 పనులు పునాది దశలో ఉండగా.. 4 పురోగతిలో ఉన్నాయి.

వెల్‌నెస్ సెంటర్‌తో మెరుగైన వైద్యం

గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్షణం మెరుగైన వైద్యం గ్రామంలోనే అందించే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ (వెల్‌నెస్ సెంటర్స్)ల నిర్మాణాన్ని ప్రభుత్వం తలపెట్టింది. అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్యం అందించే దిశగా అడుగులు వేసింది. జిల్లా వ్యాప్తంగా 338 మంజూరవగా.. రూ.57.83 కోట్లు నిధులు వెచ్చించనున్నారు. ఇప్పటికే 61 భవన నిర్మాణాలు వంద శాతం పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. గ్రామీణ విద్యార్థులు, పాఠకులకు అత్యాధునిక వసతులతో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచేందుకు డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి నాంది పలికింది. అందుకు పక్కా భవనాలకు రూ.16.00 కోట్లు మంజూరు చేయగా.. 100 భవనాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 100 భవన పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా..

రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అట్టడుగు వర్గాలకు సైతం సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పేదరికం కారణంగా చదువుకు దూరమైన వారికి అమ్మ ఒడి పథకంతో అండగా నిలుస్తున్నారు. ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా 1,55,768 మంది పిల్లల తల్లుల ఖాతాలో రూ.233.65 కోట్లు సాయం జమ చేస్తున్నారు. అంతేగాక విద్యా దీవెన కింద ప్రతి ఏటా రూ.183 కోట్లకు పైగా.. వసతి దీవెన కింద రూ.183 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. నాడు అధ్వానంగా ఉన్న పాఠశాలలు 'నాడు–నేడు' పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దారు. రెండు విడతల్లో పాఠశాలలను కార్పొరేట్‌లను తలదన్నేలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నారు. తొలి విడత పనులు ఇప్పటికే పూర్తవగా రెండో దశలో 675 పాఠశాలలకు 1,006 పనులకు గాను రూ.271 కోట్లు చేపడుతున్నారు.

రైతుల సేవలో ఆర్బీకేలు

రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు అందుబాటులోకి తీసుకువచ్చింది. తద్వారా ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. అంతేగాక జిల్లాలో 373 సొంత భవన నిర్మాణాలకు అనుమతులు అందగా రూ.81.02 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే 99 భవనాలు వంద శాతం పనులు పూర్తి చేసుకుని రైతులకు సేవలు అందిస్తున్నాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ ఒక్కో సీజన్‌లలో 66,397 మెట్రిక్ టన్నుల ఎరువుల రైతులకు అందజేస్తున్నారు.

సచివాలయాల్లో సత్ఫలితాలు



సచివాలయాలతో అన్ని రకాల సేవలు అందుతున్నాయి. నా భర్త శ్రీనివాస్ చనిపోయి నాలుగేళ్లయింది. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే అదే రేషన్‌కార్డులో ఉన్న అత్త సూర్యకాంతం వృద్ధాప్య పింఛన్ తీసుకుంటుండటంతో ఇప్పటి వరకు అర్హత సాధించలేదు. సచివాలయ వ్యవస్థ రావడం, వలంటీర్, సచివాలయ సిబ్బంది సమస్య చెప్పగానే.. కార్డులో కుటుంబ పేర్లు విభజించడంతో సమస్య పరిష్కారమైంది. వితంతు పింఛను పొందేందుకు అర్హత సాధించాను. గతంలో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు.

– యాతం శ్రీదేవిదుర్గ, నిడదవోలు

సొంతూరిలోనే రైతు భరోసా కేంద్రం



ఒకప్పుడు రైతులకు ఏ కష్టం వచ్చినా గ్రామాల్లో తీర్చేవారుండేవారు కాదు. అధికారులందరూ జిల్లా లేదా నియోజకవర్గం కేంద్రాల్లోనే ఉండేవారు. ఇప్పుడు అలా కాదు. మా ఊళ్లోనే రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. ఏ అవసరమొచ్చినా వెళ్లి సంప్రదిస్తున్నాం. దగ్గరలోనే సేవలు పొందగలుగుతున్నాం. సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఈ క్రాప్ లాంటి పనుల్లో తోడ్పడుతున్నారు. దీనివల్ల ఎంతో ప్రయోజనం పొందుతున్నాం. నాణ్యమైన పురుగుమందులతో పాటు ఎరువులూ ఇక్కడే దొరుకుతున్నాయి.

– కస్తూరి కోటేశ్వరరావు, రైతు, సమిశ్రగూడెం.

750 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



పట్టణంలో 750 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, మహిళలపై సాగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ 750 అడుగుల పొడవైన జాతీయ పతాకంతో నిడదవోలు పట్టణంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. కులవివక్ష పోరాట సమితి (కేవీపీఎస్), ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక జెంట్రీ టైలర్స్ నేతృత్వంలో తయారు చేసిన 750 ఈ పతాకాన్ని ప్రదర్శించారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన రైల్వే స్టేషన్ రోడ్, బస్‌స్టాండ్ సెంటర్, సంత మార్కెట్, అంబేడ్కర్ చౌక్, గణపతి సెంటర్ మీదుగా గణేష్ చౌక్ వరకూ సాగింది. యువత, విద్యార్థులు దేశ భక్తిని చాటుతూ భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. మహిళలు, పిల్లలపై అత్యాచారాలను అరికట్టాలని, మత సామరస్యం వర్ధిల్లాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఆ సంస్థ రాష్ట్ర నాయకుడు జువ్వల రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, భాస్కర్, తూరుగోపు నాని, గంటి కృష్ణ, గారపాటి ప్రసన్నకృష్ణ, బొచ్చా కృష్ణ, దళిత మహా సభ నాయకుడు పిల్లి సురేష్ , దళిత ప్రజా వేదిక నాయకులు చోళ్ల రాజు, నల్లా లెనిన్, మిక్కిలి అనిల్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు ఎల్లే కృష్ణంరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వార్థానికి సంక్షేమానికి తేడా గమనించండి

- చంద్రబాబు హయాంలో హామీల విస్మరణ
- ఇచ్చిన ప్రతిమాటా నెరవేర్చిన సీఎం జగన్
- వెలుగుబందలో జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: చిల్లర కాసులను కూడా వదలకుండా ఏరుకున్న వ్యక్తి కావాలా?, చీకు, చింతా లేకుండా సమస్యలన్నిటీ తీర్చే వ్యక్తి కావాలా? .. రాబోయే ఎన్నికలలో ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలో .. మీరే ఆలోచించి ఓటు వేయండి' అని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. రాజానగరం పంచాయతీ పరిధిలోని 970 మంది పేదలకు వెలుగుబంద సమీపంలో నివాస స్థలాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజనతో అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తాను సీఎంని అయితే అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తానంటూ 2014 ఎన్నికలలో చంద్రబాబు అండ్ కో చెప్పిన మాటలను జనం నమ్మారన్నారు. అధికారంలోకి తీసుకువచ్చాక ఐదేళ్ల పదవీ కాలం అయిపోతున్నా రాష్ట్రంలో ఇంచు కూడా బాగు కనిపించలేదన్నారు. చంద్రబాబును కలిసి మీరిచ్చిన హామీలను నెరవేర్చమని కోరితే 'నావద్ద డబ్బులు లేవు' అంటూ సచివాలయంలో డిబ్బీలు పెట్టించి, చిల్లర నాణాలను కూడా ఏరుకున్న సంగతిని మరచిపోయారా! అంటూ గుర్తు చేశారు.

2019 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి నాటి నుంచి నేటి వరకు ఏనాడైనా ఖజానా ఖాళీగా ఉంది, డబ్బులు లేవు, కాబట్టి మీకిచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నానని ఒక్కమాట అన్నారా? అంటూ జనాన్ని ప్రశ్నించారు. స్వార్థం చూసుకునే వ్యక్తికి, ప్రజల సంక్షేమం కోరుకునే వ్యక్తికి ఉన్న వ్యత్యాసమంటూ చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డిల పాలనలో తేడాలను గమనించాలన్నారు. రాష్ట్రంలో గడచిన నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను కూడా పెద్ద ఎత్తున అమలుచేస్తున్నారన్నారు. అమ్మ ఒడి,రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్లు, చేయూత, వైఎస్సార్ ఆసరా, ఫీజురీయింబర్స్‌మెంట్ ..ఇలా అన్ని సంక్షేమ ఫలాలను ఇంటికి తీసుకువచ్చి అందజేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ఐదేళ్ల పాలనలో జన్మభూమి కమిటీల పేరిట జనాన్ని జలగల్లా ఏవిధంగా పీల్చేసిందో గుర్తు చేశారు. దొరికన కాడికి దోచుకోవడమే సింగిల్ అజెండాగా నాడు టీడీపీ కార్యకర్త నుండి ముఖ్యమంత్రి వరకు పనిచేశారని ఆరోపించారు. గడచిన నాలుగేళ్లలో దోపిడీకి తావులేని, లంచాలతో పనిలేని, ప్రజా సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఇదే ఒరవడి కొనసాగిస్తే రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింతగా దూసుకుపోతుందన్నారు. అందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికి మరొక అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు.

• కాంతులీనిన వంతెన



రాజమహేంద్రవరంలోని గోదావరిపై హేవలాక్ వంతెన త్రివర్ణశోభను సంతరించుకుంది. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి రంగుల కాంతులతో మెరిసిపోతూ ఆకట్టుకుంది. జెండా రంగుల విద్యుద్దీప కాంతులు చీకటి వేళ గోదావరి నీటిలో ప్రతిబింబించాయి.

ఫొటో: సాక్షి రాజమహేంద్రవరం

దేశభక్తి చాటేలా 'నాభూమి- నాదేశం'

- కలెక్టర్ మాధవీలత
- సైనికులకు సత్కారం



మాజీ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి నున్న మోహనరావును సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని దేశభక్తి చాటేలా అత్యంత బాధ్యతగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో భారత ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, జిల్లా అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత ఆశయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా దేశం కోసం సేవ చేస్తున్న సైనికులను, మాజీ సైనికులను సత్కరించడం, మొక్కలు నాటడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరులకు నివాళులు అర్పించేందుకు ఇదో చక్కని వేదిక అన్నారు. పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్తు తరాలకు భద్రత కల్పిద్దామని పిలుపునిచ్చారు. దేశ ప్రగతి, అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్యాగధనుల స్మరణలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన ధైర్యవంతులకు నివాళులు అర్పించడం మన సామాజిక బాధ్యత అని అన్నారు. సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కందాల శ్రీరామమూర్తి మాట్లాడుతూ అమరవీరుల స్మారకార్థం రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సైనికులకు సత్కారం

'పంచ్ ప్రాణ్' ప్రతిజ్ఞ అనంతరం 'వీరోన్‌కా వందన్' కార్యక్రమాన్ని నిర్వహించి 13 మంది మాజీ సైనికులను కలెక్టర్ సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, రంగోళి వంటి పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ అధికారి, కెప్టెన్ సత్యప్రసాద్, డీఆర్వో జి.నరసింహులు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా) పి.జగదాంబ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



యశస్వీభవ

- కలల సాకారానికి పీఎం యశస్వీ
- 9, 10, ఇంటర్ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- దరఖాస్తుకు 17 వరకూ గడువు
- వచ్చే నెల 29న అర్హత పరీక్ష

రాయవరం: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం యశస్వి) పథకం అమలు చేస్తోంది. ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపి, ఉపాధి బాట పట్టే విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీ), ఆర్థికంగా వెనుకబడిన కులాలు (ఈబీసీ), నొమాడిక్ (సంచార), సెమీ నొమాడిక్ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే అవకాశముంది.

గత ఏడాది నుంచి..

పీఎం యశస్వి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రూపకల్పన చేసింది. ఇప్పటి వరకూ ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో ఇదొకటి. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. 9, 10 తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారికి ఏడాదికి రూ.1.25 లక్షల మేర ఉపకార వేతనం ఒకేసారి ఇస్తారు. ఎంపికైన విద్యార్థి ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు ఈ మొత్తాన్ని నేరుగా జమ చేస్తారు. దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు సహా ప్రతి రాష్ట్రం నుంచి పరిమిత సంఖ్యలో ఈ పథకానికి ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం మన రాష్ట్రంలో ఈ ఏడాది ఈ స్కాలర్‌షిప్‌లకు 1,401 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

మరో రెండు రోజులే..

దరఖాస్తు గడువు గత గురువారంతో ముగిసిపోగా ఈ నెల 17వ తేదీ రాత్రి 11.59 గంటల వరకూ గడువు పొడిగించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల 29న స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులు ఉపకార వేతనానికి అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటారో దాని పాస్‌బుక్ ఫొటో కాపీని జత చేయాలి. దరఖాస్తుదారులు ఒక్క నయాపైసా కూడా చెల్లించనవసరం లేదు. పూర్తి ఉచితంగానే దరఖాస్తు చేసుకుని పరీక్ష రాయవచ్చు.

ఇవీ అర్హతలు

- విద్యార్థి భారతీయుడై ఉండాలి.
- కేంద్ర విద్యా శాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్షకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9, 10 తరగతుల పూర్తయిన వారు కూడా ఇంటర్ వరకూ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలు మించి ఉండకూడదు.
- గ్రామాల్లో నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.

పరీక్ష విధానమిదీ..

- **మూడు గంటల** పాటు పరీక్ష ఉంటుంది.
- **హిందీ, ఇంగ్లిష్ భాషల్లో** నిర్వహిస్తారు.
- **మల్టిపుల్ చాయిస్** క్వశ్చన్ (ఎంసీక్యూ) విధానంలో **ఓఎంఆర్ షీట్ల**పై పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- **గణితంలో 30** ప్రశ్నలకు 120 మార్కులు, 25 ప్రశ్నలకు 100 మార్కులు, సైన్స్‌లో 20 ప్రశ్నలకు 80 మార్కులు, జనరల్ అవేర్‌నెస్‌లో 25 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. దేశవ్యాప్తంగా 78 నగరాల్లో ఈ పరీక్ష జరుగుతుంది.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

- ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
- పేరు, ఈ-మెయిల్, అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితర వివరాలతో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి.
- అనంతరం దరఖాస్తుదారుకు అప్లికేషన్ నంబర్ వస్తుంది.
- అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి.
- చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ చేయాలి.
- దరఖాస్తు ఫారం పూర్తి చేసిన తర్వాత దాని కాపీ ప్రింట్ తీసుకొని దగ్గర ఉంచుకోవాలి.
- పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

మంత్రి రాజాకు పలువురి పరామర్శ



సత్యనారాయణమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జక్కంపూడి రాజా

తుని: మాతృ వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి నివాసంలో సోమవారం మంత్రి తల్లి సత్యనారాయణమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, గొల్ల బాబూరావు, చలమలశెట్టి సునీల్, బీజేపీ నాయకుడు చోడ్రాజు సత్యకృష్ణంరాజు నివాళులు అర్పించి, మంత్రి రాజాను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు మంత్రి రాజాను పరామర్శించారు.

బ్యాంకు ఖాతాల నుంచి రూ.30వేలు మాయం

నల్లజర్ల: సైబర్ మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా నల్లజర్ల మండలం అనంతపల్లిలో ఇద్దరు బ్యాంకు ఖాతాల్లోని రూ.30,600 మాయమయ్యాయి. గ్రామానికి చెందిన మోటార్ మెకానిక్ దాసు రాజా ఖాతా నుంచి ఈ నెల 12,13 తేదీలలో రూ.20 వేలు కాజేశారు. అదే గ్రామానికి చెందిన రైతు బోయపాటి సుబ్బారావు ఖాతా నుంచి ఒక రోజు రూ.10వేలు, మరో రోజు రూ.600 కాజేశారు. వేలిముద్ర వేసి డబ్బు తీసుకున్నట్టుగా ఉందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. నెలరోజుల ముందు పాలవ్యాపారి గురుమిల్లి శ్రీనివాస్ ఖాతా నుంచి రూ.20వేలు లాక్కున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకన్న ఆలయంలో విన్‌టేజ్ లైటింగ్ ప్రారంభం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి రోజు రోజుకు భక్తులు పెరుగుతున్నారని, తిరుమల తిరుపతి తరువాత వారంలో శనివారం అత్యధిక మంది భక్తులు విచ్చేసే దేవస్థానంగా ప్రభవిల్లుతోందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. సోమవారం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) సహకారంతో రూ.41.70 లక్షలతో ఏర్పాటు చేసిన విన్‌టేజ్ లైటింగ్‌ను జగ్గిరెడ్డి, షర్మిలారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు. సుమారు రూ.4 కోట్లతో ప్రాకార మంటపాల నిర్మాణం, ఆలయం చుట్టూ గ్రానైట్ వేయించడం, పార్కింగ్ ప్రాంగణం వద్ద రూ.55 లక్షలతో కల్యాణ ప్రాంగణం నిర్మాణం ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. ఇప్పుడు తిరుపతి మాదిరిగా ఆలయం ముందు ఉన్న చెరువును కోనేరుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ మ్యాచింగ్ గ్రాంట్ రూ 2.80 కోట్లు విడుదల అయ్యాయన్నారు. రూ 5.5 కోట్లతో నిర్మిస్తున్న అన్నదాన భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వాడపల్లి కొత్త బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డుకు విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటుకు రుడా సహకరిస్తోందన్నారు. వాడపల్లి ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, సర్పంచ్ పోచిరాజు సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ఏపుగంటివీరరాఘవులును అభినందించారు. రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పలశ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, , జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రత్నగిరిపై ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం

- నేటి నుంచి అమలులోకి..
- గాజు, రాగి, స్టీలు, నాన్ ప్లాస్టిక్ 'బయో ఎలైట్' వాటర్ బాటిల్స్ విక్రయాలకు ఆదేశం
- 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ రూ.60
- ఖాళీ బాటిల్ తిరిగిస్తే రూ.40 వాపస్



బయో ఎలైట్ వాటర్ బాటిల్

అన్నవరం: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత ప్లాస్టిక బాటిల్స్ నిషేధించిన రెండో దేవస్థానంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం చరిత్రలో మిగిలిపోనుంది. మంగళవారం నుంచి దేవస్థానంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం అమలులోకి రానుంది. ప్లాస్టిక్ బాటిల్స్ స్థానంలో గాజు వాటర్ బాటిల్స్, రాగి, స్టీలు, నాన్ ప్లాస్టిక్ 'బయో ఎలైట్' వాటర్ బాటిల్స్ మాత్రమే వినియోగించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలు జారీచేశారు. దేవస్థానంలోని అన్ని ఫ్యాన్సీ, కూల్‌డ్రింక్స్ షాపుల నిర్వాహకులు ఈ బాటిల్స్‌ని మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ బాటిల్స్ ఏ షాపులో ఉన్నా రూ.500 జరిమానా విధించాలని ఆదేశించారు. భక్తుల కోసం దేవస్థానంలో ఎనిమిది చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అక్కడ గ్లాసులు కూడా ఉంచినట్టు తెలిపారు.

నేడు బయో ఎలైట్ నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్ ఆవిష్కరణ

రాష్ట్రంలోనే తొలిసారిగా హైదరాబాద్‌కు చెందిన 'బయో ఎలైట్' సంస్థ మొక్కజొన్న గింజల పొడికి రసాయనాలు కలిపి తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌ను మంగళవారం దేవస్థానంలో ఆవిష్కరించనున్నారు. ఈ బాటిల్‌ను రూ.40కి విక్రయించడానికి దేవస్థానం అనుమతి ఇచ్చిందని ఆ సంస్థ ఎండీ దిలీప్ తెలిపారు. ఈ వాటర్ బాటిల్స్ నాన్ ప్లాస్టిక్ అని రాష్ట్ర, కేంద్ర సంస్థలు ధ్రువీకరించిన విషయం విదితమే. ఈ బాటిల్‌ను మూడు నెలల వరకు వాడుకోవచ్చు అని తెలిపారు. తరువాత ఈ బాటిల్స్‌కు పగుళ్లు వచ్చి క్రమంగా వినియోగానికి పనికిరాకుండా పోతాయని ఆయన వివరించారు.

ద్వారకా తిరుమల దేవస్థానంలోనూ..

తూర్పుగోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానంలో బయో ఎలైట్ వాటర్ బాటిల్స్ విక్రయించేందుకు అవకాశం ఇవ్వాలని ఆ దేవస్థానం ఈఓ వి.త్రినాథరావును కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని దిలీప్ వివరించారు.

రూ.60కి 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ విక్రయం

అన్నవరం దేవస్థానంలో బయో ఎలైట్ నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌తో బాటు 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ ను రూ.60 కి అమ్మేందుకు అనుమతించారు. ఖాళీ గాజు సీసాను తిరిగి ఇస్తే రూ.40 వాపస్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎరువుల సీజ్

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలో విజిలెన్స్ అధికారులు సోమవాం తనిఖీలు చేపట్టారు. శ్రీ వెంకట మారుతి ఆగ్రో ఏజెన్సీస్ షాపులో తనిఖీలు చేయగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం, లైసెన్స్ ప్రదర్శించకపోవడం, స్టాక్‌బోర్డు అప్‌డేట్ చేయకపోవడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో షాపులోని రూ.1,86,360ల విలువైన 6.8 మెట్రిక్ టన్నుల ఎరువులను వ్యవసాయాధికారి భార్గవ్ సీజ్ చేశారు. వ్యవసాయ, పోలీసు, తూనికలు కొలతల శాఖ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

పాముకాటుకు ఏడేళ్ల బాలిక మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు శివారు జువ్విపాడులో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఏడేళ్ల బాలిక పాట్లకాయల సుమశ్రీ మృతి చెందింది. పాట్లకాయల సూర్యమోహన్ రావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు నవ్యశ్రీ, సుమశ్రీలతో కలసి జువ్విపాడులో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి చిన్నమ్మాయి సుమశ్రీ మంచంపై పడుకుని ఏడుస్తుండటంతో తల్లి ఏమైందని అడిగింది. తన కుడిపాదం మధ్య వేలు వద్ద మంట వస్తోందని ఆ బాలిక తెలిపింది. పరిసరాల్లో ఏమైనా విషపు పురుగులు, పాముగాని ఉందేమోనని వెతకగా ఏమీ కనిపించలేదు. భర్త లారీ పని మీద పొరుగూరికి వెళ్లడంతో స్థానికుల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి సుశీల ఫిర్యాదుతో రామచంద్రపురం అడిషనల్ ఎస్సై ఏపీ సీతారామాచార్యులు కేసు నమోదు చేశారు. సోమవారం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక వేళంగి సమీపంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది.

సాక్షి ఫ్యామిలీ

IV

రాజమహేంద్రవరం
మంగళవారం ॥ 15-8-2023

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?

నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.



స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్. శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు. శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను/1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఎడారిలో ఆశల మొలక



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హెమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).